క్లుప్తంగా

విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: ఎస్సీ వర్గీకరణ అమల్లోకి తేవాలని కోరుతూ జనవరి 27న హైదరాబాద్‌లో తలపెట్టనున్న వెయ్యి గొంతులు లక్ష డప్పులతో మాదిగల మహాదండోరాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఐనాల వెంకన్న కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వెంకన్న మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు కాంచనపల్లి దయాకర్, దూడపాక వెంకన్న పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లల నిబంధన తొలగించాలి



మహబూబాబాద్ రూరల్: ముగ్గురు పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయరాదనే నిబంధనను తొలగించాలని మండలంలోని వీఎస్.లక్ష్మీపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మీసాల వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రవి, కమలాకర్, సురేష్, వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలు



నెల్లికుదురు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి 19ఏళ్ల విభాగంలో యోగా పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో 10జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర పరిశీలకుడు తోట సురేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు చెడుపల్లి అయిలయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు శంకర్, ప్రవీణ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం

నెల్లికుదురు: జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆలేరు జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న జూనియర్స్ బాలికల కబడ్డీ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కబడ్డీ జట్టుకు గ్రామానికి చెందిన శ్రీరాం శేఖర్ క్రీడా దుస్తులు అందించారు. కార్యక్రమం సంద వీరన్న, ఎంఈఓలు రాందాస్, లచ్చిరాం పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కురవి: ప్రైవేట్ లాడ్జీలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కురవి ఎస్సై గండ్రాతి సతీష్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి కురవిలోని ఆలయ పరిసరాల్లో ఉన్న ప్రైవేట్ లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లాడ్జీల్లో రిజిస్టర్లను పరిశీలించారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? లేదా? పరిశీలించారు. మైనర్లకు అద్దె గదులు ఇస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు వెంకటయ్య, జానివియా, కానిస్టేబుళ్లు రమేష్, హరిబాబు, వీరస్వామి, మహిళా కానిస్టేబుళ్లు అనితారాణి, శ్రీవాణి పాల్గొన్నారు.

ఒత్తిడితోనే విద్యార్థుల ఆత్మహత్యలు

మరిపెడ రూరల్: రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్ల యజమాన్యం ఒత్తిడిని తట్టుకోలేకనే విద్యార్థుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ బాణాల గోపి ఆరోపించారు. ఈమేరకు మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశాలు పురస్కరించుకొని మరిపెడ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, ప్రవీణ్, యాకూబ్, సురేష్ పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి



కేసముద్రం: పద్మశాలీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సంఘం రాష్ట్ర నాయకుడు చిలకమారి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ, ముందుకు నడవాలని, అప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సామల నర్సయ్య, ఉపాధ్యక్షుడు సామల ఉపేందర్, కార్యదర్శి సమ్మయ్య, మామిడాల శ్రీనివాస్, చిట్యాల వీరన్న, చలమల్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నారుమడిలో యాజమాన్య పద్ధతులు

- మెలకువలు పాటిస్తే నాణ్యమైన నారు
- రాత్రివేళల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



పెద్దవంగరలో నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్దవంగర: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలు చేతికి వచ్చాయి. ప్రస్తుతం యాసంగిలో నీటివసతి కింద వరిసాగును చేసేందుకు సిద్ధమవుతున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పంటలు వేస్తున్నారు. నీరు ఎక్కువగా ఉన్నచోట్ల వరినారు పోస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు నార్లు పోశారు. చలికాలం కావడంతో మంచు కురుస్తుండడంతో వరినారు ఎదుగుదల నిలిచిపోయే ప్రమాదం ఉంది. నారుమడుల్లో మేలైన యాజమాన్య పద్ధతులు చేపడితే నాణ్యమైన నారు పొందవచ్చని మండల వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

మండలంలో ఈ యాసంగిలో 13,023 ఎకరాల్లో వరి సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఎకరా పొలంలో వరి నాటు వేయడానికి ఐదుసెంట్ల నారుమడి సరిపోతుంది. నారుమడిని 10నుంచి 12రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు దమ్ము చేసి చదును చేయాలి. నారు మడికి నీరు పెట్టేందుకు నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా చిన్న కాల్వలను ఏర్పాటు చేసుకోవాలి. సాయంత్రం పూట నారుమడిలో నీరు తీసివేసి పగటిపూట వెచ్చని నీరు పెడుతూ ఉండాలి. రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బుట్టలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాల పట్టాలతో నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీయాలి. జింకు లోపంతో ఆకులపై మచ్చలు ఏర్పడుతాయి. నివారణకు జింకు సల్ఫేట్ 2గ్రాములలీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి.

వరిసాగులో నారుమడి కీలకం



నాణ్యమైన నారుతో మంచి దిగుబడులు వస్తాయి. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడరాదు. ఎక్కువ వాడినట్లైతే దిగుబడులపై ప్రభావం చూపుతోంది. యాసంగిలో చలితీవ్రత ఎక్కువగా ఉండడంతో నారు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నారుమడి యాజమాన్య పద్ధతులపై మండల ఏఈఓలతో కలసి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- స్వామి నాయక్, మండల వ్యవసాయ అధికారి

మొక్కలు ఎండిపోతున్నాయ్..!



తొర్రూరులోని అంబేడ్కర్‌నగర్ సమీప డివైడర్‌పై ఎండిన మొక్కలు

తొర్రూరు: మున్సిపాలిటీ సుందరీకరణలో భాగంగా డివైడర్లపై నాటిన మొక్కలు, వివిధ రకాల చెట్లు నీరందక మాడిపోతున్నాయి. పట్టణంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి డివైడర్, అన్నారం రోడ్డులోని డివైడర్‌పై వివిధ రకాల మొక్కలు నాటారు. అలంకరణ, పూలజాతి మొక్కలు నాటగా ఆ మొక్కలకు నీరు అందక ఆకులు, కొమ్మలు చివరికి మాను వరకు దెబ్బతిని మోడుబారుతున్నాయి. డివైడర్లపై అత్యధికంగా కోనోకార్పస్ మొక్కలు నాటడంతో వాటితో ప్రయోజనం లేకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. దానిపై 'సాక్షి'లో కథనం వెలువడగా ప్రస్తుతం ఆ మొక్కలను తొలగిస్తున్నారు. కోనోకార్పస్ మొక్కల తొలగించడం బాగానే ఉన్నా అంబేడ్కర్ నగర్ డివైడర్‌పై నాటిన అలంకరణ మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి మొక్కలకు విధిగా నీరు అందించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గార్ల: రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గార్లలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పంజాబ్ రాష్ట్రంలో గత 19 రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతు సంఘం నాయకుడు జగజిత్‌సింగ్ దలేవాల్ ఆరోగ్యం క్షీణించిందని, ఆయనకు ఏమైనా అయితే కేంద్రప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం దేశంలోని అన్ని రైతు సంఘాలతో రైతుల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య, ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, మురళీకృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లికుదురు: 16రోజులుగా సమ్మె చేపడుతున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

నిత్యావసరాల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: చే గువేరా భూపతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం(బి) గ్రామంలో నిరుపేదలకు ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. భూపతి ఫౌండేషన్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, సేవల కోసం 97049 65443 కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హరీశ్, అజయ్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం

బయ్యారం: రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాస్‌లైన్ జిల్లా నాయకులు జగ్గన్న అన్నారు. ఆదివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. చాలా మంది రైతులకు ఇప్పటి వరకు ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు సూర్యం, యాకయ్య, లచ్చయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు

డోర్నకల్: డోర్నకల్ మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సుల్లో టీఎస్ ఆర్టీసీ చెకింగ్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. బస్సులో మహిళా ప్రయాణికుల వద్ద టికెట్లతోపాటు ఆధార్ కార్డులను తనిఖీ చేశారు.

పేదల అభివృద్ధికి కృషి చేస్తా..

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మాట్లాడుతున్న రవీందర్‌రావు

నెహ్రూసెంటర్: పేదల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో దొరన్నకాలనీ, భట్టు అంజయ్యకాలనీలో రోడ్లు, విద్యుత్ సౌకర్యం అభివృద్ధి పనులు కేటాయించగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలు కష్టాలు పడుతున్నారని తన దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. కాలనీల్లో మంచినీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీలు ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్సీని కాలనీ ప్రజలు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మంగళంపల్లి ఖన్న, మార్నేని రఘు, జెర్రిపోతుల వెంకన్న, అశోక్, లింగన్న, హెచ్.లింగన్న, భట్టు చైతన్య, గుజ్జ దేవేందర్ పాల్గొన్నారు.

కళాకారుల గుర్తింపు అభినందనీయం



మాట్లాడుతున్న కళాకారులు

నెహ్రూసెంటర్: తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కళాకారులకు ఉద్యోగాలు ఇచ్చేలా శాసనమండలిలో ఆమోదించడం అభినందనీయమని కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్వాస్ వెంకటేశం, అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, సంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కేదాసు రమేష్, పగిడిపాల వెంకటరావు, వీరన్న, వెంకన్న, ఉప్పలయ్య, బద్రి, కట్లోజు పాండురంగాచారి పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

కేసముద్రం: శాసనమండలి సభలో ఉద్యమ కళాకారులపై పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ సానుకూలంగా స్పందించడంపై ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి, తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయక్, భుక్య బాలునాయక్, తరాల సంపత్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రకాష్ రెడ్డి

పెద్దవంగర: స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లను గెలిపించుకొని బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ప్రకాష్ రెడ్డి కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అవుతాపురం గ్రామంలో బూత్ కమిటీల ఎన్నికపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తూ వారితో మమేకమై పని చేయాలని తెలిపారు. ప్రజలకు అండగా ఉంటే పార్టీపై సానుకూల దృక్పథం ఏర్పాడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, నాయకులు మహేందర్, శ్రీమాన్, కోటేశ్వర్, కుమార్, పల్లె కుమార్, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

- ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ అశోక్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్సై

కురవి: జీవితం జీవించడానికేనని, ఆత్మహత్యలు వద్దని ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత అని కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, కురవి ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. ఆదివారం కురవి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న వ్యక్తులు అన్ని దారులు మూసుకపోయినప్పుడు ఆత్మహత్య ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. ఆత్మహత్యలు చేసుకునే యత్నాలను గుర్తించి వారికి మానసికంగా మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మచ్చ వీరన్న, గడీల వినోద్, బాదావత్ వీరన్న, మూడు శ్రీను, పోలీస్ సిబ్బంది అనితారాణి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో రైల్వే మూడోలైన్ పనులతో మూసివేసిన రోడ్డుకు ప్రత్యామ్నాయంగా సీసీ రోడ్డును వేయాలని, ప్రజల రవాణా కోసం చర్యలు తీసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రత్యామ్నాయ రోడ్డును సీపీఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా మెటల్ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలని, ప్రత్యామ్నాయ రోడ్లు వేయాలని, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజధర్మన్న, పెరుగు కుమార్, వెలుగు శ్రావణ్, ఎండి.మహమూద్, గాదెం శ్యాంప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ వెంకటస్వామికి నివాళి



మహబూబాబాద్: నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, తదితరులు



మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు, తదితరులు

మహబూబాబాద్: కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఆదివారం మాజీ ఎంపీ వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్ : మాజీ ఎంపీ జి.వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీఎస్పీ తిరుపతిరావు ఆదివారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.



తొర్రూరు: తహసీల్దార్ కార్యాలయంలో..

తొర్రూరు: పేద ప్రజలకు కాకా చేసిన సేవలు వెలకట్టలేనివని డిప్యూటీ తహసీల్దారు ఉప్పల నర్సయ్య అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయాల్లో గడ్డం వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

మరిపెడ రూరల్: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న బిల్డింగ్ కార్మికులందరికి ప్రత్యేకంగా గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీసీ డబ్ల్యూఎఫ్–సీఐటీయూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండ ఉన్నలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఆనెపురం, ఎలమంచిలితండ, ఇటుకలపాడుతండా గ్రామ పంచాయతీలలో భవన నిర్మాణ కార్మికల సమస్యలపై సర్వే నిర్వహించారు.

ఊరేగింపుగా పంబారట్టు



దంతాలపల్లి: మండలకేంద్రంలో ఆదివారం అయ్యప్ప భక్తులు సంకీర్తన నిర్వహించారు. చీకటి రమేశ్, మహేష్ గురుస్వాముల ఆధ్వర్యంలో మాలధారణ చేసిన అయ్యప్పస్వాములు భక్తిపాటలతో పంబారట్టును ఊరేగింపుగా నిర్వహించారు.

రామానుజన్ జయంతి

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి, కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

నెల్లికుదురు: భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలల్లో తెగిపోయిన ఎస్సారెస్పీ కెనాల్ కాల్వలు, చెరువు కట్టలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి రైతుల పంటల సాగుకు నీరందే విధంగా చర్య తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆదివారం ఆయన వివిధ గ్రామాలల్లో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో భిక్షపతి, మంగ్య, నర్సయ్య, యాకన్న పాల్గొన్నారు.

వైద్యశిబిరం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని మైత్రిస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంకరబోడ్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలునాయక్ , డాక్టర్ ఫైసల్ రోగులను పరీక్షించి బీపీ, షుగర్ టెస్టులతోపాటు మందులను ఉచితంగా అందజేశారు.

కంటి వైద్యశిబిరం

తొర్రూరు: ప్రతి ఒక్కరూ నేత్ర సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఇట్టె సోమిరెడ్డి అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. యాకూబ్, వీరభద్రం, రాజలింగం, గట్టు సోమయ్యలు పాల్గొన్నారు.

ఆకేరు వాగులో ఘర్షణ

నెల్లికుదురు: ఏ బిడ్డా ఇది నా అడ్డా.. అన్న తరహాలో ఇసుక దందా మూడు పూలు ఇరు కాయలుగా కొనసాగుతున్నా అధికార యంత్రాంగం పట్టింపులేదు. ఈ క్రమంలో ఆదివారం మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ పరిధిలోని ఆకేరు వాగులో అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వేల్పుల ప్రభాకర్ తన ఇసుక ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక తేవడానికి వాగులోకి వెళ్లాడు. వాగులో ఇసుక కూలీగా పనిచేస్తున్న పెరుమాండ్ల సంజీవకు ప్రభాకర్‌కు మధ్య గొడవ జరిగింది. సంజీవకు తీవ్రకు గాయాలయ్యాయి. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

ధ్వజారోహణ మహోత్సవ పూజలు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రప్రథమంగా ధ్వజారోహణ మహోత్సవ పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అదేవిధంగా మండల పూజల ముగింపు కార్యక్రమాలు ఈనెల 26వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గద్దె రవిగురుస్వామి ఆదివారం తెలిపారు. నేడు ఉదయం శ్రీభూతబలి పూజలు, 108 అష్టకలశ పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

డోర్నకల్/కురవి: బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని వెన్నారం సీపీఎం గ్రామ కార్యదర్శి జాగర్లమూడి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమం కొమ్ము ప్రసాద్, బోయినపల్లి దేవేందర్, ఉపేందర్, వెంకన్న పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు

మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని భార్గవ ఫంక్షన్ హాలులో పరలోకపు క్రీస్తు కృపా మందిరం రెవ సీహెచ్ చార్లెస్ చారి–విజయ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య ఈతిథులుగా హాజరైన ప్రేమ పాస్టర్స్ ఫెల్లోషిప్ మరిపెడ కమిటీ పెద్దలు పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో జాఘువా వెంకటేశ్వర్లు, భాస్కర్, దావిద్ మహేందర్, రాజేష్ పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

మహబూబాబాద్ రూరల్: హనుమాన్ దీక్ష స్వీకరించిన పలువురు స్వాములు పట్టణంలోని సాలార్ తండా అభయ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ఇరుముడిధారణ అనంతరం ఆదివారం హనుమాన్ నామస్మరణ చేస్తూ కొండగట్టు అంజన్న సన్నిధికి తరలివెళ్లారు.

బంగారు మైసమ్మ పండుగ



మరిపెడ రూరల్: మండలంలోని బాల్యతండాలో గ్రామ దేవత అయిన బంగారు మైసమ్మ పండుగను గిరిజనులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా మైసమ్మతల్లికి యాటలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతీ ఏటా ఆనవాయితీగా వస్తున్న పండుగలో యువకులు, పెద్దలు కర్రలను చేత బూని పొలిమేరలో కేరింతలతో తిరుగుతూ బలిచల్లారు.

కోతుల బెడదను నివారించాలి



గార్లలో సంచరిస్తున్న కోతుల గుంపు

గార్ల: గార్ల మండలంలో కోతుల బెడదను నివారించాలని మండల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఇంటి తలుపులు తీసి ఆదమరిస్తే చాలు, కోతులు దర్జాగా ఇళ్లలో చొరబడి వండిన వంటకాలను ఎత్తుకెళ్లి తింటున్నాయి. ఎదురు తిరిగితే మనుషుల మీదికి ఎగబడి కరుస్తున్నాయి. మండలంలో వ్యవసాయ పంటలను సైతం కోతులు ధ్వంసం చేస్తూ పంటలను నష్టపరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి మండలంలో కోతుల బెడదను నివారించేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.